నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 22-11-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక: 100 పేజీలు: 4 వెల: రూ.1/-

బతుకమ్మ పండగకు ప్రత్యేక ప్రాధాన్యం

ఫోట్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొన్న కవిత

హైదరాబాద్,నవంబరు 21(ఆర్ఎన్ఎ): బతుకమ్మ పండుగకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇవ్వడమే గాకుండా విశ్వవ్యాప్తం చేసిందిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,మాజీ ఎంపి కల్వకుంట్ల కవిత తెలిపారు బతుకమ్మకు ప్రోత్సాహంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పెరిగిందన్నారు. బతుకమ్మ స్టేట్ లెవల్ ఫోటో కాంటెస్ట్-2019 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి కవిత ముఖ్యఅతిథిగా కవిత హాజరై మాట్లాడారు. బతుకమ్మను ప్రతిబింబించేలా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన ఫోటో జర్నలిస్టులకు కవిత అవార్డులు ప్రదానం చేశారు. ఈసారి నాన్ జర్నలిస్టులకు

అవకాశం కల్పించడం శుభ పరిణామమని ఆమె చెప్పారు. ప్రతి ఫోటో జర్నలిస్టుపై ఎంతో సామాజిక బాధ్యత ఉందని కవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి కెటిఆర్

డీఆర్ఎఫ్ వాహనాలు ప్రారంభం

- ప్రారంభించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్21(ఆర్ఎన్ఎ) : నగరంలోని జీహెచ్ఎంసీ పార్కింగ్ యార్డులో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వాహనాలను ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియేఉద్దీన్, ఎన్వోర్మెంట్ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటితో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం వాహనాల పనితీరును, పరికరాల ఉపయోగాన్ని మంత్రి కేటీఆర్‌కు అధికారులు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో విపత్తులు సంభవించినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా రూపొందించారు. విపత్తుల నివారణకై ప్రత్యేకంగా రూపొందించిన ఎనిమిది వాహనాల్లో ఒక్కొక్కదానిలో ఆరు ప్రత్యేక పరికరాలు కలిగిన బాక్సులు, జనరేటర్, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాలు ఉన్నాయి.

ప్రతి వాహనాన్ని మంత్రి కేటీఆర్ పరిశీలించి అత్యవసర సమయంలో ఏ పరికరాన్ని ఏవిధంగా ఉపయోగిస్తారు సిబ్బందిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి డిజాస్టర్ రెస్క్యూ వాహనంలో మెడికల్ కిట్,సేఫ్టీ హెల్మెట్ లు, కట్టర్లు, పంప్ సెట్,డిమాలిషన్ హమార్, స్లాబ్ కట్టర్స్ ÷ర్ బాల్స్ , సేఫ్టీ నెట్ తో పాటు రక్షణ పరికరాలు ఉన్నాయి. వీటితోపాటు రోప్ లాడర్, ఎలక్ట్రిక్ కటర్లు తదితర 13పరికరాలు ఉన్నాయి. 500 మీటర్ల వరకు వ్యాపించే ప్రత్యేక ఆస్కా లైట్లు నేడు ప్రారంభించిన వాహనాల్లో ప్రత్యేకంగా సమకూర్చుకున్న ఆస్కా లైట్ లు మంత్రి కేటీఆర్ ను ఆకట్టుకుంది.

రాత్రివేళల్లో దాదాపు 20 అడుగుల ఎత్తుకు వెళ్లి ఆటోమేటిక్ గా వెలుతురు ను ఈ ఆస్కా లైట్ దాదాపు 500 మీటర్ల వరకు అందిస్తుంది. ఇటీవల గోదావరి నదిలో బోటు మునిగిన సందర్భంలో ఈ విధమైన ఆస్కాలైట్ ల సహాయంతో బోటు వెలికి తీసే కార్యక్రమాలను చేపట్టినట్టు విశ్వజిత్ వివరించారు. ఈ ఆధునిక పరికరాలు వాహనాలను సమకూర్చుకోవడం ద్వారా జిహెచ్ఎంసి ఎన్ ఫోర్స్ మెంట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగం విపత్తుల నివారణ రంగంలో ప్రత్యేకంగా నిలిచిందని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. నగరవాసుల్లో భద్రతకు సంబంధించి విశ్వాసాన్ని కల్పించడంలో డీఆర్ఎఫ్ సఫలీకృతం అయిందని మంత్రి అభినందించారు.

కాశ్మీర్‌లో తప్పిన పెనుముప్పు

ఐఇడి బాంబును పట్టుకున్న భద్రతాబలగాలు

శ్రీనగర్,నవంబర్21(ఆర్ఎన్ఎ): జమ్మూ - శ్రీనగర్ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం భద్రతా బలగాలు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. అనంత్‌నాగ్ జిల్లాలోని వాన్పూ వద్ద ఐఈడీ బాంబు లభ్యమైంది. దీంతో బాంబు స్కాడ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఆ బాంబును నిర్వీర్యం చేశారు. రహదారిపై ఐఈడీ బాంబు లభ్యం కావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. భారత బలగాలే లక్ష్యంగా ఉగ్రవాదులు జాతీయ రహదారిపై ఐఈడీ అమర్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. జమ్మూ - శ్రీనగర్ జాతీయ రహదారిపై పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. జమ్మూ - పూంచ్ హైవేపై మంగళవారం ఐఈడీ బాంబును నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే.

డెంగీతో బాలుడు మృతి

రంగారెడ్డి,నవంబర్21(ఆర్ఎన్ఎ): 15 ఏళ్ల ఓ బాలుడు డెంగీకి బలయ్యాడు. రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలంలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన ఎం.డీ. ఫసియొద్దీన్(15) గత కొన్ని రోజులుగా డెంగీ జ్వరంతో భాద పడుతున్నాడు. అతడి తలిదండ్రులు ఆస్పత్రిలో చూపించిన ప్రతిసారీ.. అతడిలో ఎలాంటి మార్పు రాక పోగా, రోగం వికటించి ఉదయం మరణించాడు. ఫసియొద్దీన్ మన్‌మర్రి జెడ్ఎ హెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే తమ కుమారుడు మరణించడంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయి, విలపిస్తున్నారు. బాలుడి మరణంతో గ్రామంలో, అతడు చదువుకుంటున్న పాఠశాలలో విషాద ఛాయలు అల్లుముకున్నాయి.

రైల్వే స్టేషన్‌లో నిండుగర్భిణికి పురుడు

డాక్టర్‌ను అభినందిస్తున్న నెటిజన్లు

ముంబై,నవంబర్21(ఆర్ఎన్ఎ): నెలలు నిండి నొప్పులు పడుతున్న నిండు గర్భిణికి రైల్వే స్టేషన్ లో పురుడు పోశాడు ఓ రైల్వే డాక్టర్. ఈ ఘటన మహారాష్ట్ర లోని పన్వెల్ రైల్వే స్టేషన్ లో జరిగింది. గర్భంతో ఉన్న ఓ మహిళ గురువారం పొద్దున నేరూల్ నుంచి పన్వెల్ కు వెళ్లింది. అయితే నొప్పులు రావడంతో రైల్వే స్టేషన్ లోనే కుప్పకూలింది. అక్కడే డ్యూటీలో ఉన్న రైల్వే డాక్టర్ ఆ మహిళ పరిస్థితిని గమనించి.. స్టేషన్ లోనే పురుడు పోశారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని స్థానిక హాస్పిటల్ కు తరలించారు. రైల్వే శాఖ నిర్వహిస్తున్న ఒక్క రూపాయి క్లినిక్ లో మహిళ పురుడు పోసుకుంది. సాధారణంగా ప్రయాణికులకు ఏదైనా చిన్నపాటి ఆరోగ్య సమస్యలపై అప్పటికప్పుడు రియాక్ట్ అయ్యేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఈ వన్ రుపీ క్లీనిక్ లను నిర్వహిస్తుంది. ఈ హాస్పిటల్ లో ఓ మహిళ పురుడుపోసుకోవడంతో నెటిజన్లు డాక్టర్ ను మెచ్చుకుంటున్నారు.

విమానం రద్దుతో అయ్యప్ప భక్తుల ఆందోళన

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలువురు ప్రయాణికులు ఆందోళనకు దిగారు. అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమలకు వెళ్లేందుకు వారం రోజుల క్రితమే పలువురు ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. తీరా వీరు శబరిమల వెళ్లేందుకు గురువారం విమానాశ్రయానికి చేరుకున్నారు. కాగా ఆ విమానం రద్దు అయిందని సిబ్బంది పేర్కొంది. దీంతో ఎయిర్ ఇండియా తీరుపై ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేపట్టారు. తమకు సమాచారం ఇవ్వకుండానే విమానాన్ని రద్దు చేయడమే గాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 21 : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తొర్రూరు మండలం మాటడులో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ... రైతు సంక్షేమం విషయంలో గత ప్రభుత్వాలకు, కేసీఆర్ ప్రభుత్వానికి తేడా చూడండి. వ్యవసాయాన్ని లాభసాటిగా చెయ్యాలని సీఎం కేసీఆర్ ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తున్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు ఇస్తున్నారు. పెట్టుబడి కోసం ప్రతి ఎకరాకు ఏటా రూ.10 వేలు ఇస్తున్నారు.

పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏటా రూ.13 వేల కోట్లు కేటాయిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా రైతులు మరణిస్తే రైతు బీమాతో ఆసరాగా ఉంటున్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కేసీఆర్ గారి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోనీది. వరి ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. పత్తిని కొనుగోలు చెయ్యాల్సిన కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీసీఐ మాత్రం పట్టించుకోవడం లేదు. రైతు సంక్షేమం విషయంలో రాష్ట్రంలోని టిఆర్ఎస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తేడా చూడండి. అందరి సహకారం, సమష్టి కృషితో స్వచ్ఛ సర్వేక్షన్ లో తెలంగాణ రాష్ట్రానికి అవార్డు వచ్చిందని తెలిపారు.

రక్షణరంగ పార్లమెంటరీ కమిటీలో ప్రజ్ఞాసింగ్

పలు కమిటీల్లో వైకాపా ఎంపిల నియామకం

న్యూఢిల్లీ,నవంబర్21(ఆర్ఎన్ఎ): వివాదాస్పద బీజేపీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌కు.. రక్షణరంగ పార్లమెంటరీ కమిటీ ప్యానెల్‌లో స్థానం కల్పించారు. దీంతో ఈ అంశం వివాదాస్పదమైంది. రక్షణ రంగాన్ని అవమానించారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. 21 మంది ఎంపీలు ఉండే కమిటీని రక్షణశాఖ విడుదలచేసింది. ఆ ప్యానెల్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వం వహిస్తారు.

కమిటీ జాబితాలో ఫారూక్ అబ్దుల్లా, సౌగత్ రాయ్, ఏ రాజా, శరద్ పవార్‌లు కూడా ఉన్నారు. మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితురాలిగా ఉన్న ప్రజ్ఞా ఠాకూర్‌ను ఎలా రక్షణ కమిటీలో సభ్యురాలిగా చేశారని విమర్శలు వస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలకు తాజాగా పార్లమెంటరీ సలహా సంఘం సభ్యుల నియామకాలు జరిగాయి.

ఎంపిలను ఇందులో నియమించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వివిధ సలహా సంఘాల్లో సభ్యులుగా నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ లోక్‌సభ పక్షనేత మిథున్‌రెడ్డి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సలహా సంఘంలో సభ్యులుగా నియమితులు కాగా... మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆర్థిక శాఖ సలహా సంఘంలో చోటు దక్కించుకున్నారు. వివిధ శాఖల సలహా సంఘంలో నియమితులైన వైఎస్సార్ సీపీ ఎంపీల జాబితా ఇలా ఉంది. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ - వల్లభనేని బాలశౌరి,మహిళా శిశు సంక్షేమ శాఖ - చింతా అనురాధ, పర్యాటక, సాంస్కృతిక శాఖ - రెడ్డప్ప, హోం శాఖ - గోరంట్ల మాధవ్, ఉక్కు శాఖ - నందిగామ సురేష్, షిప్పింగ్ - తలారి రంగయ్య , బల్లి దుర్గాప్రసాద్,విదేశాంగ శాఖ - సత్యవతి,రైల్వే శాఖ - ఆదాల ప్రభాకర్ రెడ్డి,పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ - విజయసాయిరెడ్డి, ఆరోగ్య శాఖ - వంగా గీత,పశు, మత్స్యశాఖ - శ్రీ కృష్ణ దేవరాయలు

చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ - వైఎస్ అవినాష్ రెడ్డి.,ఆర శుద్ధి పరిశ్రమల శాఖ - గొడ్డేటి మాధవి

విద్యుత్ శాఖ - రఘురామకృష్ణంరాజు.జలశక్తి శాఖ - బ్రహ్మానందరెడ్డి,గృహ పట్టణ వ్యవహారాల శాఖ - నత్యనారాయణ,అడవులు పర్యావరణం - కోటగిరి శ్రీధర్, వ్యవసాయ, రైతు సంక్షేమం - బెల్లాన చంద్రశేఖర్

భారీ పరిశ్రమలు , ప్రభుత్వ రంగ సంస్థలు - మార్గాని భరత్, రవాణా జాతీయ రహదారులు - డాక్టర్ సంజీవ్ కుమార్,విద్యుత్తు సంప్రదాయేతర ఇంధన వనరులు - వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు నియమితులయ్యారు.

27న కార్టోశాట్ - 3 ప్రయోగం

- ట్విటర్‌లో ప్రకటించిన ఇస్రో

న్యూఢిల్లీ, నవంబర్21(ఆర్ఎన్ఎ) : కార్టోశాట్ -3 ప్రయోగ తేదీని మార్చేశారు. రెండు రోజులు ఆలస్యంగా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రో చెప్పింది. వాస్తవానికి ఈనెల 25వ తేదీన ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. అయితే షెడ్యూల్‌ను మార్చినట్లు తాజాగా ఇస్రో గురువారం తన ట్వీట్‌లో కొత్త తేదీని ప్రకటించింది. ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటల 28 నిమిషాలకు కార్టోశాట్-3 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ47 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు వెల్లడించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో ఉన్న రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి కార్టోశాట్ - 3 నింగిలోకి దూసుకువెళ్తుంది. కార్టోశాట్-3తో పాటు మరో 13 కమర్షియల్ నానోశాటిలైట్లను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. హై రెజల్యూషన్ ఇమేజింగ్ సామర్థ్యం ఉన్న ఉపగ్రహంగా కార్టోశాట్ - 3ని రూపొందించారు. ఇది థార్డ్ జనరేషన్‌కు చెందినది. కార్టోశాట్-2 ఉపగ్రహంతో పోలిస్తే కార్టోశాట్-3 అత్యంత అధునాతనమైనది. దీంట్లో హై రిజల్యూషన్ వ్యవస్థ ఉంటుంది. దీంతో 25 సెం. మీ. రిజల్యూషన్‌తో, 16 కి. మీ. పరిధిలో ఈ ఉపగ్రహం ఫొటోలు తీస్తుంది. కార్టోశాట్-3లో మల్టీస్పెక్ట్రల్(విద్యుదయస్కాంత స్పెక్ట్రమ్ పరిధిలోపల చిత్రాల్ని తీయడం), హైపర్ స్పెక్ట్రల్(విద్యుదయస్కాంత స్పెక్ట్రమ్? పరిధిని దాటి చిత్రాలు తీయడం) వంటి అధునాతన వ్యవస్థలు ఉన్నాయి. దీంతో ఉగ్రవాద శిబిరాలు, దాక్కున్న శత్రువులకు సంబంధించిన ఫొటోలను జూమ్(పెద్దగా) చేసి తీసే వీలు కలుగుతుంది.

పేటీఎం నుంచి వస్తున్న నకిలీ 'కేవైసీ' మెసేజ్

యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని సమాచారం

మోసగాళ్ల మాయలో పడవద్దన్న సంస్థ

న్యూఢిల్లీ,నవంబర్21(ఆర్ఎన్ఎ): తమ పేటీఎం సంస్థ పేరిట ఓ నకిలీ సందేశం వస్తోందని, కొన్ని లక్షల మందికి ఇది చేరిందని, దయచేసి దీన్ని నమ్మవద్దని సంస్థ సీఈఓ విజయ్ శేఖర్ శర్మ తన ట్విట్టర్ ఖాతాలో ఓ అత్యవసర సందేశాన్ని పోస్ట్ చేశారు. ది ఓ కేవైసీ స్కామ్ అని, దీన్ని నమ్మకూడదని అన్నారు. కేవైసీ వివరాలను వెంటనే అందించి, కింద ఉన్న లింక్ ను క్లిక్ చేసి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోకపోతే ఖాతా నిలిచిపోతుందన్న సమాచారం కొన్ని లక్షల మందికి వెళ్లడంతో, ఈ వ్యవహారంపై స్పందించిన విజయ్ శేఖర్, కస్టమర్లను అప్రమత్తం చేశారు. పేటీఎం ఎప్పుడూ ఇలాంటి వివరాలను అడగబోదని ఆయన స్పష్టం చేశారు. ఏ విధమైన యాప్ లను డౌన్ లోడ్ చేసుకోవాలని కూడా తాము సూచించబోమని తెలిపారు. బహుమతుల మాయలో పడవద్దని సూచించారు. ఖాతా వివరాలను హ్యాక్ చేసేందుకు మోసగాళ్లు చేస్తున్న పని ఇదని, దీనిపై తాము ఇప్పటికే ఫిర్యాదు చేశామని అన్నారు.

పెరుగుతున్న చలికి తోడు మళ్లీ స్వైన్ భయం

జాగ్రత్తుల తీసుకోవాలని వైద్యుల హెచ్చరిక

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): చలి మెల్లమెల్లగా పెరుగుతోందని, దీంతో స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభించే ప్రమాదంఉందని వైద్యులు హెచ్చరించారు. చలితోపాటే వ్యాధులు కూడా వ్యాధులు కూడా విజృంభిస్తున్నాయని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులతోపాటు స్వైన్ ఫ్లూ కూడా మళ్లీ జడలు విప్పుతోంది. వాతావరణ మార్పులకు తోడు చలి పెరుగుతుండటంతో స్వైన్ ఫ్లూ చాపకింద నీరులా విజృంభిస్తోంది. శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతోన్నవారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ కేసులు ప్రజలను భయపెడుతున్నాయి. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నమోదైన కేసులే అందుకు రుజువు. జనవరి నుంచి ఇప్పటివరకు ఒక్క గాంధీ ఆస్పత్రిలోనే 98 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 23మంది మృత్యువాత పడ్డారు. నవంబరులో కూడా రెండు పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఒకరు మృత్యువాతపడ్డారు. అయితే, చలి మరింత పెరగనున్న నేపథ్యంలో స్వైన్ ఫ్లూ కేసులు కూడా పెరిగే అవకాశముందని వైద్యులు అంటున్నారు. ఎవరైనా జలుబు, జ్వరం, దగ్గు, గొంతు నొప్పితో బాధపడుతుంటే జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండేవారు... దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు... హెచ్ఐవీ పేషెంట్లు... తప్పనిసరిగా వ్యాక్సిన్స్ తీసుకోవాలని చెబుతున్నారు. చలినుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.

శ్రీలంక ప్రధానిగా మహింద రాజపక్స ప్రమాణం

కొలంబ, నవంబర్ 21: శ్రీలంక ప్రధానిగా మహింద రాజపక్స ప్రమాణస్వీకారం చేశారు.

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీకి పరాభవం ఎదురైన నేపథ్యంలో ప్రధాని రణిల్ విక్రమసింఘే తన పదవికి రాజీనామా చేశారు. విక్రమసింఘే అధికారికంగా పదవి నుంచి వైదొలిగిన అనంతరం, ప్రతిపక్ష నేత మహింద రాజపక్స ప్రధానిగా ప్రమాణం చేశారు. దేశంలో సాధారణ ఎన్నికలు జరిగే వరకు మహింద ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగనున్నారు.

శ్రీలంక తదుపరి ప్రధానిగా తన సోదరుడు మహింద రాజపక్స పేరును ఆ దేశ నూతన అధ్యక్షుడు గోటబయ రాజపక్స ఖరారు చేశారు. మరోవైపు, తాజా ఎన్నికల్లో అధికార యూఎన్‌పీ ఓడిపోయిన నేపథ్యంలో పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలని విక్రమసింఘెపై ఒత్తిడి పెరుగుతున్నది.

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్

మంచిర్యాల, నవంబర్ 21: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇవాళ చెన్నూరు మండలంలో పర్యటించారు. అస్సాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 వాలీబాల్ సెలెక్షన్స్, టోర్నమెంట్‌ను సుమన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మంచిర్యాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించింది.

అం తకుముందు నాగపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు బాల్క సుమన్. చెన్నూరు పట్టణ కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ప్రారంభించారు.

చరిత్రలో నేటినిజం

తం॥ సుద్దులవలె మోహనముగ-
వాద్దులతేనట్టి లీల - వరుసగ - గానం
బొద్దుచు - కళామతల్లికి
ముద్దులసుతుడైన 'బాలమురళి'నిగొలుతున్!!

(నవంబర్ 22 బాలమురళీ కృష్ణ పుణ్యతిథి)

-రాధశ్రీ
సెల్: 9494481210

వ్యక్తిపై కత్తులతో దాడి

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. హైదరాబాద్ బంజారాహిల్స్ ఇంద్రానగర్‌లో తెల్లవారుజామున గౌస్ అనే వ్యక్తిపై నవీన్ యాదవ్, అనిల్ అనే ఇద్దరు యువకులు కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం గౌస్ ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

నేటినిజం
శుక్రవారం 22-11-2019

ఎవరి ప్రస్థానం ఎటు..?

ప్రభుత్వం మారినపుడల్లా దేశాల విధానాలు 'వ్యతిరేక దిశలో' మారడం 'ప్రజాస్వామ్య వ్యవస్థ'లో నిహితమై వున్న 'అపరిణత'కు 'అపరిపక్వత'కు నిదర్శనం. పరిణత ప్రజాస్వామ్య వ్యవస్థలలో ప్రభుత్వాలు మారినప్పటికీ 'జాతీయ ప్రయోజనం' పట్ల 'సమష్టి హితం' పట్ల ప్రధానరాజకీయ పక్షాల దృక్పథం మారదు,మారబోదు! ఏదైనా అంతర్జాతీయ మహావిప్లవం సంభవించినపుడు మాత్రమే వివిధ దేశాల విదేశాంగ విధానాలు మారడం చరిత్ర. అందువల్ల అనాదిగా మన దేశంతో వున్న అనుబంధాన్ని శ్రీలంక, మాల్దీవులు, నేపాల్ వంటి దేశాలు నిరంతరం కొనసాగించాలి. ఈ అనుబంధానికి ప్రాతిపదిక సాంస్కృతిక సమానత్వం. ఈ మూడు దేశాలు ఒకప్పుడు 'అఖండ భారత్'లో భాగం. బ్రిటన్ దురాక్రమణ సమయంలో ఈ మూడు దేశాలూ 'అఖండ భారత్'నుండి రాజకీయంగా విడిపోవడం చరిత్ర. కానీ యుగాలనాటి సాంస్కృతిక సమానత్వాన్ని ఈ అన్ని దేశాల ప్రజలు ఇప్పటికీ పరిగణిస్తున్నారు, పాటిస్తున్నారు. మాల్దీవులలో అనాదిగా వేదమతాలు, సాంస్కృతిక భాషా రూపాంతరాలు కొనసాగాయి. బౌద్ధమతం పరిఢవిల్లింది. క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దిలో అరబ్ జిహాదీలు, ఆ తరువాత ఐరోపా దురాక్రమణదారులు మాల్దీవులలో చొరబడినారు. 'మాల్దీవులు' మన దేశం నుండి విడిపోయింది. ఇటీవలికాలంలో చైనా చొరబడడం మన భద్రతకు ముప్పుగా పరిణమించిన విపరిణామం. కానీ గత సంవత్సరం అధ్యక్షపదవికి జరిగిన ఎన్నికలలో మాల్దీవుల ప్రజలు చైనా అనుకూల రాజకీయవాదులను ఘోరంగా ఓడించారు. భారత అనుకూల రాజకీయ పక్షానికి విజయం చేకూర్చారు. శ్రీలంక అధ్యక్షుడుగా ఎన్నికైన గోతబయ రాజపక్స ఈ పాఠాన్ని మరువరాదు... గత శతాబ్ది ఆరంభం వరకు కూడా భారతీయులు సింహళ-శ్రీలంక ప్రజలు కొలంబో నుంచి కైలాసం వరకూ వున్న అఖండ భారత భూమిని మాతృభూమిగా భావించడం చరిత్ర. క్రీస్తుశకం 19వ శతాబ్ది చివరిలో అమెరికాకు వెళ్లిన వివేకానందస్వామి మూడేళ్ల తరువాత తిరిగి వచ్చాడు. సింహళ ద్వీపంలోని 'కొలంబో'లో ఓడ దిగిన తరువాత వివేకానంద స్వామి మాతృభూమిని సందర్శించిన ఆనందంతో పరవశుడయ్యాడు. కొలంబోలో నేలపై పొర్లి మాతృభూమికి అంజలి ఘటించాడు. భరతమాతకు కైలాస పర్వత ప్రాంతం శిరోభాగం, మాల్దీవులు, సింహళం పాదయుగళం. అందువల్లనే కొలంబోలో వివేకానందుడు భరతమాత పాదాలకు నమస్కరించాడు. సింహంలో శాంకరీదేవీ శక్తిపీఠం నెలకొని వుంది. భారత జాతీయుల స్ఫూర్తికేంద్రాలు, సాంస్కృతిక తీర్థస్థలాలు భారత్ సరిహద్దుల లోపలనే ఉండటం చరిత్ర. భౌగోళిక వాస్తవాన్ని బ్రిటన్ వ్యతిరేక స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మన నాయకులు మరచిపోవడం మన దక్షిణ భద్రతకు ముప్పుతెచ్చిన వైపరీత్యం. కోట్ల సంవత్సరాల క్రితం 'సింహళ' భూభాగం భారతదేశపు ప్రధాన భూమిని అంటుకొని వుండేది. కాలగర్భంలో జరిగిన మార్పులవల్ల సంభవించిన 'చలనం'- కాంటినెంటల్ డ్రిఫ్ట్- ఫలితంగా 'సింహళం' భరత ఖండపు ప్రధాన భూమికి దూరంగా జరిగింది. అందువల్ల చైనా, అమెరికా వంటి దేశాలు సమీప ద్వీపాలను తమ దేశాలలోనే ఉంచుకోగలిగినట్టుగానే 1947 తరువాత మాల్దీవులను, శ్రీలంక సింహళంను మన ప్రభుత్వం మన దేశంలో ఉంచుకొనగలిగి ఉండాలి. అది జరగలేదు. మన దక్షిణ సరిహద్దులలో చైనా చొరబాటునకు ఇదంతా చారిత్రక నేపథ్యం... ఎల్‌టిటిఇ శ్రీలంకకు మాత్రమే కాదు మన దేశానికి కూడా శత్రువు. కానీ శ్రీలంక ప్రభుత్వం ఎల్‌టిటిఇ ప్రజ్వరిల్లిన యుద్ధాన్ని శ్రీలంకలోని సామాన్య తమిళ ప్రజలపై జరిగిన దమనకాండగా ప్రచారం జరిగింది. తమిళనాడులోని ద్రవిడ మున్నేట్ర కజగం తదితర ద్రవిడ పక్షాలు ఈ అసత్యపు ప్రచారం చేశాయి. 2009వ 2014లమధ్య ఈ ద్రవిడ పక్షాల ఒత్తిడికి లోనైన మన ప్రభుత్వం శ్రీలంక ప్రభుత్వం పట్ల కొంత వ్యతిరేకతను ప్రదర్శించింది. శ్రీలంక ప్రభుత్వం సామాన్య ప్రజలపై దమనకాండ సాగించిందన్న తీర్మానానికి అనుకూలంగా మన ప్రభుత్వం 2012 మార్చిలో 'ఐక్యరాజ్యసమితి'లో ఓటువేసింది. మన దేశం పట్ల మహేంద్ర రాజపక్స ప్రభుత్వం విముఖతను ప్రదర్శించడానికి ఇది కూడ ఒక ఉదాహరణం!

శబరిమలకు కొత్త చట్టం చేయండి

- టీటీడీ తరహాలో ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించండి

- రెండునెలల్లో కొత్త చట్టాన్ని కోర్టుకు సమర్పించాలి

- కేరళ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, నవంబర్21(ఆర్ఎన్ఎ) : శబరిమల ఆలయ నిర్వహణకు కొత్త చట్టం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జనవరి మూడో వారంలోపు కొత్త చట్టం తీసుకురావాలని కేరళ ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. పండలం రాజ కుటుంబం వేసిన పిటిషన్ ను ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. శబరిమల ఆలయానికి టీటీడీ తరహాలో ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించాలని, టీటీడీ తరహాలో శబరిమల ఆలయ బోర్డు ప్రత్యేక చట్టం చేయాలని కేరళ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. రెండునెలల్లో కొత్త చట్టాన్ని కోర్టుకు సమర్పించాలని కోర్టు తెలిపింది. చట్టం చేయాలని గతంలోనే చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించింది. లక్షలాది మంది భక్తులు వెళ్లే అయ్యప్ప ఆలయానికి ప్రత్యేక చట్టం ఉండాలని సుప్రీంకోర్టు తెలిపింది. కేరళలో 3వేల దేవాలయాలకు ఒకే ఐఏఎస్ అధికారి ఉండటం సరికాదన్నారు. అయ్యప్ప దేవాలయాన్ని ప్రత్యేకంగా తీసుకోవాలని సుప్రీం కోర్టు కేళర ప్రభుత్వాన్ని సూచించింది. కేరళలోని ఇతర ఆలయాలతో కలిపి చట్టం తీసుకురావడం సమంజసం కాదని జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై దాఖలైన సమీక్ష పిటిషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు విచారించిన విషయం తెలిసిందే. ఆలయంలోకి మహిళల ప్రవేశం సహా ఇతర మతపరమైన అంశాలను ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం పరిశీలిస్తుందని గత గురువారం సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ వ్యవహారాన్ని ఏడుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, గతంలో ఇచ్చిన తీర్పుపై ఎలాంటి స్టే విధించలేదు. అయినప్పటికీ భద్రతా కారణాలరీత్యా 10-50ఏళ్ల లోపు మహిళలను అనుమతించకుండా కేరళ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వార్షిక మండల పూజల నిమిత్తం గత శనివారం శబరిమల ఆలయాన్ని తెరిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అయ్యప్ప దర్శనానికి పలువురు 10-50ఏళ్ల లోపు మహిళలు రాగా.. వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన పోలీసులు వారిని వెనక్కి పంపారు. మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన ఓ 12ఏళ్ల బాలికను పంబ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా కులవృత్తులకు ప్రోత్సాహం

రంగసముద్రం చెరువులో రొయ్య పిల్లలను వదిలిన మంత్రి తలసాని

మహబూబ్‌నగర్,నవంబర్21(ఆర్ఎన్ఎ): కుల వృత్తులను ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుల వృత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఆయా వర్గాలకు సబ్సిడీలతో పాటు ప్రోత్సాహకాలను కూడా అందచేస్తున్నామని అన్నారు. బుధవారం అచ్చంపేట నియోజక వర్గం పరిధిలోని రంగసముద్రం చెరువులో స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి మంత్రి తలసాని రొయ్య పిల్లలను విడుదల చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా , సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మత్స్యకారుల కోసం ఉచితంగా రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే చేప విత్తనాలను కూడా పంపినీ చేస్తున్నామని చెప్పారు. వేలాదిమంది మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ, పాడి రైతులకు 4 రూపాయల ప్రోత్సాహకం అందిస్తున్నామని అన్నారు. కలువృత్తులను ప్రోత్సహించడం ద్వారా వారిని ఆర్థికంగా నిలబెట్టాలన్నదే సర్కార్ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో అందరూ ఆర్థికంగా ఎదగాలని మంత్రి తలసాని ఆకాంక్షించారు.

గ్రంథాలయాలతో యువతకు మేలు

వారోత్సవాల్లో జడ్పీ చైర్మన్ కమల్ రాజు

ఖమ్మం,నవంబర్20(ఆర్ఎన్ఎ): ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలంటే అది గ్రంథాలయం లోనే సాధ్యం అని ల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. గ్రంథాలయాలతో యువత విజ్ఞానాన్ని అర్జించాలన్నారు. ఖమ్మంలో జరుగుతున్నటువంటి 52వ గ్రంథాలయ వార్షికోత్సవ ముగింపు సభకు హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడారు.

గ్రంథాలయ చైర్మన్ కమర్, మేయర్ పాపాలాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ గతంలో కంటే ఇప్పుడు గ్రంథాలయాలు మరింత సౌకర్యాలతో నూతన,వివిధ రకాల పుస్తకాలతో మరింత అభివృద్ధి చెందాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. రానున్న కాలంలో మరింత అండగా ఉంటాం అని అన్నారు. అనంతరం గ్రంథాలయంలో చదువుకొని వివిధ రంగాలలో ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ జడ్పిటిసి వరప్రసాద్, గ్రంథాలయ కమిటీ,విద్యార్థులు, ఎన్నారై ఫౌండేషన్ వారు,తదితరులు పాల్గొన్నారు

గిరిజన సంక్షేమం కోసం పక్కా ప్రణాళికలు: ఎమ్మెల్యే

మహబూబాబాద్,నవంబర్21(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందతున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు.

గత ప్రభుత్వాలు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే భావించాయని, సంక్షేమం గురించి ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. సీఎంకు గిరిజనులు రుణపడి ఉంటారని అన్నారు. సీఎం కేసీఆర్ బృహత్తరమైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని కొనియాడారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ లేని తండాలు, గూడేలను గుర్తించి అక్కడి ప్రజలకు రూ.125కే విద్యుత్ కనెక్షన్లు అందించనున్నారని, 50 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేయనున్నారని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజనుల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని వెల్లడించారు.

తండాల్లో రోడ్లు, విద్య, వైద్యం, ఉ పాధి, అటవీ భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను అందించనున్నారని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల కోసం నివేదికలను అందించేందుకు ప్రత్యేక కమిటీని నియమించారని హర్షం వ్య క్తం చేశారు. గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి, రోడ్లు, విద్యుత్ తదితర అంశాలపై సమగ్రంగా సర్వే చేసి నివేదికను అందించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాలోని తండాలు, గూడేల్లో రహదారుల నిర్మాణం కోసం నిధులను విడుదల చేశారని, వెల్లడించారు.

మద్యం మత్తులో యువత

హైదరాబాద్, నవంబర్ 21:దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్య నియంత్రణ, బార్ల కుదింపు వంటి చర్యల కారణంగా మద్యం ప్రవాహాన్ని అడ్డుకోవాలని ఎపి సర్కార్ కసరత్తు చేస్తోంది. అయితే పక్కనే యానం, ఇటు తెలంగాణలో మద్యం తక్కువ ధరలకే దొరకడంతో ఇప్పుడు చాలామంది దృష్టి ఇటువైపు పడింది. గతంలో ఎప్పుడూ లేనంతగా యువత మద్యం మత్తులో చిత్తవుతోంది. ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం వంటి కారణాలతో యువత పెడదారి పడుతోంది. ఇకపోతే గంజాయి ఈ మధ్య భారీగా పట్టుబడడం చూస్తుంటే ఆందోళన కలిగిస్తోంది. మద్యం, గంజాయి, చీప్ లిక్కర్, నాటుసారా తయారీతో రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక అశాంతి నెలకొనే దుస్థితి ఏర్పడింది. ఇటీవల గతంలో ఎన్నడూ లేనంతగా గంజాయి పట్టుబడుతోంది. ప్రధానంగా ఇక్కడి నుంచి మహారాష్ట్ర,తమిళనాడుల నుంచి విదేశాలకు గంజాయి రవాణా అవుతోంది. పోలీసలు దాడులతో గంజా పట్టుబడుతోంది. ప్రధానంగా మన్యం కేంద్రంగా గిరిజన గూడాల్లో గంజాయి సాగు జోరందుకుంది. దీనికి డిమాండ్ ఉండడంతో కొందరు అమాయక గిరిజనులకు డబ్బు ఎరగా వేసి పంటపండిస్తున్నారని పోలీసులు ఆరోపిస్తున్నారు. మద్యం దుకాణాలను దూరంగా తరలించాల్సింది పోయి హైదరాబాద్‌లో అయితే ఏకంగా మళ్లీ కల్లు దుకాణాలకు పర్మిషన్లు ఇచ్చారు. దీనిని సర్కార్ కూడా గొప్ప విజయంగా చెప్పుకోవడం సిగ్గుచేటు. మద్యాన్ని ప్రజలకు దూరం చేసి ఆరోగ్య సమాజాన్ని నిర్మించాల్సిన పాలకులు ప్రజలను తాగుబోతులుగా మార్చి వచ్చే డబ్బుతో కిలో రూపాయి బియ్యం లాంటి దుబారా పథకాలకు ఖర్చు చేయడం సిగ్గుచేటు. మద్యపానం అనేది సప్త వ్యసనాల్లో ఒకటి. దాన్నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. మద్యం వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి. మద్యాన్ని నియంత్రించాలి తప్ప గేట్లు బార్లా తీయడం వల్ల ఆదాయం సమకూరుతున్నా, అనారోగ్య సమాజాం నిర్మితమవుతోంది. ప్రభుత్వం లిక్కర్‌ను ఆదాయ వనరుగా చూసినంతకాలం దాని దుష్పరిణామాలకు సమాజం బలికావాల్సిందే. మరోవైపు మన్యంలో నాటుసారా ఏరులై పారుతోంది. నాటు సారాకు గిరిజనులు బానిసై బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు. ఇంటిని, ఒంటిని గుల్ల చేసుకుంటున్నారు. చివరకు అనారోగ్యంతో కాలం వెల్లదీ స్తున్నారు. బహిరంగంగానే సారా విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో సారా వ్యాపారులు అమ్మ కాలను రోజురోజుకూ పెంచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. డబ్బులకే కాకుండా వస్తువులను తాకట్టు పెట్టుకునికూడా సారా విక్రయిస్తూ గిరిజనులను దోచుకుంటున్నారు. మన్యంలో నాటుసారా విక్రయాలు అడ్డు, ఆపులేకుండా సాగుతున్నాయి. దశాబ్దాలుగా గిరిజనేత రులు తమ ఆదాయం కోసం నాటుసారా విక్రయాలు జరుపుతున్నారు. దట్టంగా ఉండే ఆటవీప్రాంతాలు సారా తయారీకేంద్రాలుగా మార్చుకుని వ్యాపారాలు కొనసాగి స్తున్నట్టు సమాచారం. వీటన్నింటికీ కొందరు డబ్బున్న వారు ముందుండి సారాను సరఫరా చేస్తున్నారని సమాచారం. పలుమార్లు సారా కేసుల్లో పలుమార్లు జైలుకు కూడా వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. గిరిజన గ్రామాల్లో సారా విక్రయాలు కూడా ఇక్కడ అతి సాధారణంగా జరుగు తున్నాయి. కొన్ని ఇళ్లల్లోనే వీటిని విక్రయిస్తున్నారు. ప్రధానంగా కొన్నిచోట్ల నల్లబెల్లంతోనూ గుడంబాను తయారు చేఇ విక్రయిస్తున్నారు. అంతేకాకుండా వారపు సంతల్లో కూరగాయలు, నిత్యావసరాలు, ఇతర సరుకులతో పాటుగా సారాను కూడా వీధుల్లో పెట్టి అమ్ముతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించు కున్న దాఖలాలు లేవు. ఎపిలోని మన్యం గ్రామాల్లో వారపు సంతల్లోనే సారా విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. సారా కాసేందుకు కావాల్సిన నల్లబెల్లం, అమ్మోనియం వంటివి ముందుగానే మన్యానికి చేరిపోతున్నాయి. అత్యంత గోప్యంగా వ్యాపారులు వీటిని తరలిస్తున్నారు. పోలీసులకు ఎంతోకొంత ముట్టజెప్పడంతో వారు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. వ్యాపారులు గ్రామంలో కొంతమంది గిరిజనులను మచ్చిక చేసుకుని వారి ఇళ్లలో ఈ ముడి సరుకులను పెడుతున్నారు. దీనికిగాను ప్రతిఫలంగా నిత్యావసర సరుకులు, కొంత సారాను గిరిజనులకు ముట్టజెబుతున్నట్టు సమాచారం. దీంతో నాటు సారాకు గిరిజనులు బానిసలవుతున్నారు. సారారక్కిసి బారిన పడిన ఎంతో మంది గిరిజనులు అనారోగ్యాలకు గురవుతున్నారు. కొంత మంది తనువు చాలిస్తున్నారు. సారా తాగిన వారిలో ఎక్కువ మందిలో కాళ్లవాపు, జీర్ణశ్వాస సంబంధింత వ్యాధులు, కంటి, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. సారా తాగితే తప్ప తన పని తాను చేసుకోలేని పరిస్థితికి కొంత మంది గిరిజ టనులు చేరుకున్నారు. అంతగా వ్యాపారులు వారిని సారాకు బానిస చేసేశారు. సారా కోసం ఇంట్లో భార్య, బిడ్డలను కొట్టి మంగళసూత్రాలు, ఇంట్లో బిందెలు, చీరలు వంటి తీసుకెళ్లి తాకట్టు పెడుతున్నారు. నాటుసారాఏరులై పారుతున్నా నివారణా చర్యలు అంతంత మాత్రంగానే కనిపి స్తున్నాయి. ప్రసార మాధ్యమాల్లో వార్తలు వచ్చినప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో సారా నిర్మూలన కు ఎలాంటి చర్యలూ తీసుకోవట్లేదని పలువురు విమర్శిస్తున్నారు. మద్యం ఆదాయమే సర్కార్‌కు జీవనాధారంగా మారింది. పట్టణాల్లో లిక్కర్ షాపులకు గిరాకీ తగ్గడం లేదు. ప్రభుత్వాలకు ఇదే ప్రధాన ఆదాయ వనరుగా మారడంతో మద్యం అమ్మకాలు పెరిగాయి. బెల్టు షాపులు, పర్మిట్ రూంలు లేకపోతే మద్యం దుకాణాలు తీసుకోడానికి వ్యాపారులు సిద్ధంగా లేరు. వైన్ షాపుల్లో మద్యం సేవించరాదని చట్టం చెబుతున్నా అనధికారిక పర్మిట్ రూంలకు కొదవ లేకుండా పోతోంది. మద్యం ఆదాయంపై ఆధారపడుతున్న ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించడం లేదు. ఇబ్బడి ముబ్బడిగా జనావాసాల్లో తిష్టవేసిన మద్యం,కల్లు దుకాణాలను తరలించాలి. ఆంధ్రా, తెలంగాణ అన్న తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. ఊరి బయట నుంచి జనవాసాలకు తరలుతున్న మద్యం దుకాణాలు, బార్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళల ఆందోళనలు ఇటీవల చేపట్టినా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదు.

ఉద్యోగాల భర్తీలో కానరాని చిత్తవుద్ధి

-తెలంగాణా వస్తే ఇంటికో ఉద్యోగం అనలేదా?

నిరుద్యోగులకు అండగా బీజెవైఎం

మెదక్,నవంబర్21(ఆర్ఎన్ఎ) తెలంగాణా వస్తే బతుకులు బాగుపడుతాయనుకున్నామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న ముఖ్యమంత్రి మాటలను నమ్మి ఓటేస్తే కనీసం తమను ప్రశ్నించే హక్కు, శాంతియుతంగా ఆందోళన కూడా చేసే అవకాశం లేకుండా నయా నిజాంలా కేసీఆర్ వ్యహరిస్తున్నాడని బీజెపి అధికార ప్రతినిధి రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉద్యమ సమయంలో, ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని కేసీఆర్ సహా టీఆర్ఎస్ నేతలంతా వేలాది సభల్లో సందర్భాల్లో వల్లె వేసిందికాక మేమెక్కడా ఇంటికోఉద్యోగం ఇస్తా మని చెప్పలేదని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జ్ఞానం తెచ్చుకుని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని చురకలంటించారు. ప్రైవేట్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పి మరోసారిమసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోఅధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచిపోయిందని ఎన్నివేల ఉద్యోగాలిచ్చారో శాఖలవారిగా శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. కేవలం 15 వేలే మాత్రమే ఇచ్చారని ఇందులో కూడా 10వేలు కానిస్టేబుల్లవేనని, వీరిని నిరుద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, కార్మికులు రోడ్ల పైకి ఎక్కి ఎక్కడా ఆందోళనలు చేయకుండా నిరోధించేందుకు తాపత్రయ పడుతున్నాడన్నారు. తెలంగాణా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడు తున్న సమయంలో నాడు పాలకులు పోలీస్ యాక్ట్ 30 లు, 144 సెక్షన్‌లు అమలు చేసి ఉంటే ఆందోళనలు సాగేవా...తెలంగానా రాష్ట్రం ఆవిర్భవించేదా అని నిలదీశారు. తెలంగాణా స్వరాష్ట్రంలో ఎలాంటి కేసులు లేకుండా నిర్భయంగా ఉద్యోగాలువచ్చి కుటుంబం అంతా హాయిగా బతుకచ్చునుకున్న సామాన్యుడిని అణగతొక్కి తన కుటుంబంలో మాత్రం నాలుగు ముఖ్య ఉద్యోగాలు సంపాదించుకుని కోట్లకు పడగలెత్తుతున్నారని మండిపడ్డారు. ఓవైపు నిరుద్యోగులు తినడానికితిండి దొరకక ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఉద్యోగాలు కల్పించాల్సిన టీఎస్‌పీఎస్సీ పాలకులకు మాత్రం లక్షలకు లక్షలు వేతనాలిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్ చేస్తున్న నిర్వా కం చూస్తే ప్రతిఒక్కరు నవ్వుకుంటున్నారని, గ్రూప్ వన్ అధికారుల నియామకంలో వ్యవహరించినతీరు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, ఇటీ వలే 50వేల మంది పరీక్షా కేంద్రాల్లో వైట్‌నర్ తో ఓఎంఆర్‌షీట్లను మార్చుకున్న సంగతి సిగ్గుగా అనిపించడంలేదా అని నిలదీశారు. యుపిఎస్‌సీకి దీటుగా టీఎస్‌పీఎస్‌సీని తీర్చిదిద్దుతామన్న కేసీఆర్ ఆనాడు కేవలం నలుగురు డైరెక్టర్లుంటే నేడు15మంది డైరెక్టర్లను నింపుకుని రిటైర్ ఆయిన వారికి దొడ్డిదారిని ఉపాది కల్పిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులకు అండగా బీజెపి, బీజెవైఎం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఆవిర్భావం నాటికి మిగులు బడ్జెట్‌తో ఉండేదని నేడు లక్షా 50వేల కోట్ల అప్పుల్లోకి నెట్టి వేశారని, ఈ నిధులన్నీ కూడా కమిషన్ కాకతీయ, కమీసన్ మిషన్ భగీరథలద్వారా సీఎం తదితర నేతల జేబుల్లోకి వెల్లాయని ఆరోపించారు.

చర్చనీయాంశంగా మారిన చెన్నమనేని పౌరసత్వం

మళ్లీ ఉప ఎన్నిక వస్తుందా అన్న చర్చ

తుది తీర్పు కాదని వాదిస్తున్న రమేశ్

వేములవాడ,నవంబర్21(నేటినిజం ప్రతినిధి): వేములవాడ టీఆర్ఎస్ ఎమ్మెల్యే రమేష్‌బాబు పౌరసత్వ వివాదంపై కేంద్రహోంశాఖ అధికారికంగా ఉత్తర్వులు వెల్లడించిన నేపథ్యంలో ఇప్పుడు తదుపరి చర్యలేమిటి అన్న చర్చ సగుతోంది. రమేష్‌బాబు పౌరసత్వం రద్దు కావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో మరోసారి రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. ఇక్కడ ఉప ఎన్నిక వస్తుందా లేక గతంలో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే అవుతారా అన్న చర్చ కొనసాగుతోంది. వేములవాడ నియోజకవర్గంలో ఆది శ్రీనివాస్ వర్గీయులు, కాంగ్రెస్‌నాయకులు హోంశాఖ తీర్పుపై సంబురాలు జరుపుకున్నారు. టీఆర్ఎస్, ఎమ్మెల్యే రమేష్‌బాబు వర్గీయుల్లో ఎమ్మెల్యే సభ్యత్వంపై అయోమయం నెలకొంది. 2009 సార్వత్రిక ఎన్నికల్లో వేములవాడ నుంచి చెన్నమనేని రమేష్‌బాబుపై స్వల్ప ఓట్ల తేడాతో కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్ ఓటమి చవిచూశారు. రమేష్‌బాబు ఎన్నిక చెల్లదని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పౌరసత్వం పొందారని ఆది శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా రమేష్‌బాబు రాజీనామా చేశారు. 2010 జూన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా రమేష్‌బాబు పోటీ చేశారు. వేములవాడ ఉప ఎన్నికను నిలిఎ వేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను నిలిపివేసింది. టీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించడంతో ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో హైకోర్టు మిగతా నియోజకవ ర్గాలతోపాటు ఎన్నికలు జరపాలని సూచించింది. దీంతో ఎన్నికల కమిషన్ యథావిధిగా ఎన్నికలు నిర్వహించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉప ఎన్నికల్లో రమేష్‌బాబు గెలుపొందారు. సుప్రీం కోర్టు హైకోర్టు నిర్ణయాన్ని అప్పుడు తప్పుబట్టడంతో చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి రమేష్‌బాబు పౌరసత్వంపై ఆది శ్రీనివాస్ పోరాటం చేస్తూనే వచ్చారు. అనేక మలుపులు తిరుగుతూ 2013లో చెన్నమనేని రమేష్‌బాబు పౌరసత్వాన్ని, శాసనసభ సభ్యత్వాన్ని హైకోర్టు రద్దు చేసింది. చెన్నమనేని రమేష్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. 2014 ఎన్నికల్లో మరోసారి టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో కేంద్ర హోంశాఖ 2017లో రమేష్‌బాబు పౌరసత్వాన్ని రద్దు చేసింది. హోంశాఖ తీసుకున్న నిర్ణయం హైకోర్టుకు చేరడంతో మరోసారి మలుపు తిరిగింది. కేంద్ర హోంశాఖ గతంలో ఇచ్చిన తీర్పును హైకోర్టు రద్దుచేసి మరోసారి రమేష్‌బాబు పౌరసత్వంపై విచారణ చేపట్టాలని చట్ట ప్రకారంగా పరిశీలించాలని ఆదేశించింది. 12 వారాల్లో విచారణ తేల్చాలని పేర్కొంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం అక్టోబరు 31, 2019న కేంద్ర హోంశాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు తరపు న్యాయవాది రామారావు, కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్ తరపు రవికిరణ్‌రావు, రో

తనభూమిలో అక్రమమైనింగ్ చేస్తున్నారు

– అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటంలేదు

– యాదాద్రిలో సెల్ టవర్ ఎక్కిన రైతన్న

యాదాద్రి భవనగిరి,నవంబర్21(ఆర్ఎన్ఎ): సాగు చేసే రైతులు నిరసన వ్యక్తంచేయాల్సిన దుస్థితికి చేరుకున్నారు. కష్ట నష్టాలకు వెరువకుండా పాడి పంటలు పండించే రైతులు తమ భూముల కోసం పోరాడాల్సిన పరిస్థితికి వచ్చారు. పాసు పుస్తకాల కోసం సంవత్సరాల తరబడి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న క్రమంలో సహనం కోల్పోయిన రైతులు పెట్రోల్ బాటిళ్లతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు. ఈ క్రమంలో ఓ రైతు తన భూమి కోసం సెల్ టవర్ఎక్కి నిరసన వ్యక్తంచేశారు. తన భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని సత్యనారాయణ అనే రైతు సెల్ టవర్ ఎక్కాడు. తన భూమిలో మైనింగ్ మానివేయాలని డిమాండ్ చేశాడు. తనకు న్యాయంచేయాలని కోరుకుంటున్నాడు. యాద్రాద్రి జిల్లా మోత్కూర్ లో సత్యనారాయణకు కొంత భూమి ఉంది. ఆ భూమి నుంచి కొంతమంది మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ ప్రభుత్వ అధికారులకు, పోలీసులకు గత కొంతకాలంగా మొరపెట్టుకుంటున్నాడు. కానీ రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులు గానీ సత్యనారాయణ గోడును పట్టించుకోలేదు. దీంతో తన భూమిలో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సాగు చేసుకోవటానికి కష్టాసాధ్యంగా మారిందనీ..తనకు న్యాయంచేయమని అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన సత్యనారాయణ మోత్కూర్ లో ఉన్న ఓ సెల్ టవర్ ఎక్కాడు. దీంతో సెల్ టవర్ దగ్గరకు చేరుకున్న పోలీసులు సత్యనారాయణకు సర్ది చెప్పేందుకు యత్నిస్తున్నారు. కానీ..సంబంధిత అధికారులు గానీ, స్థానిక ఎమ్మెల్యే వచ్చిన తనకు హామీ ఇస్తేనే తనకు దిగి వస్తాననీ, లేకుండా అక్కడ నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని డిమాండ్ చేసాడు. చివరకు అధికారులు అక్కడికి చేరుకొని సత్యనారాయణకు హామీ ఇవ్వడంతో దిగివచ్చాడు.

దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ అమలు

– రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, నవంబర్20(ఆర్ఎన్ఎ) : దేశవ్యాప్తంగా జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్సీ) అమలు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. రాజ్యసభలో బుధవారం కశ్మీర్ పరిస్థితిపై సమాధానం చెబుతూ జాతీయ పౌర జాబితా అంశాన్ని కూడా ప్రస్తావించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఎన్ఆర్సీ పక్రియను నడుస్తోందని, ఈ పక్రియ ఏ ఒక్క మతాన్ని లక్ష్యంగా చేసుకోవడం కానీ, తొలగించడం కానీ ఉండదన్నారు. అన్ని మతాల ప్రజలకు ప్రభుత్వం 'ఆశ్రయం' కల్పిస్తుందని చెప్పారు. అసోంలో ఎన్ఆర్సీ తుది జాబితాలో పేర్ల తొలగింపుపై మాట్లాడుతూ, ఎన్ఆర్సీ జాబితాలో పేర్లు లేని వారికి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే హక్కు ఉంటుందని, లీగల్ ఖర్చులు భరించలేని విషయంలో అసోం ప్రభుత్వమే సొంతంగా ఖర్చులు భరిస్తుందని అమిత్‌షా చెప్పారు. లాయర్‌కు అయ్యే ఖర్చులు సమకూరుస్తుందని తెలిపారు. హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, క్రిస్టియన్లు, పార్శీ శరణార్థులు భారత పౌరసత్వం పొందుతారని, అందుకోసమే పౌరసత్వ సవరణ బిల్లు అవసరమైందని చెప్పారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లో వివక్షకు గురైన ఈ శరణార్థులందరికీ భారత పౌరసత్వం లభిస్తుందని అమిత్‌షా పేర్కొన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చడం మాఉద్దేశం కాదు

- ప్రజలే కర్రుకాల్చి వాతపెట్టే రోజులు దగ్గరల్లో ఉన్నాయి
- ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేఖంగా పోరాడతాం

– భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

– నాగర్‌కర్నూల్ జిల్లాలో భాజపా కార్యాలయాన్ని ప్రారంభించిన లక్ష్మణ్

నాగర్‌కర్నూలు,నవంబర్21(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో తెరాస ప్రభుత్వాన్ని కూల్చడం మా ఉద్దేశం కాదని, ఆర్టీసీ సమ్మెను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని హైకోర్టులో చెప్పడం సిగ్గుచేటని భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం నాగర్ కర్నూలులో భాజపా జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడారు...

ఆర్టీసీ సమ్మెకు మద్దతివ్వడంతో పాటు ప్రజలకు ఏ సమస్య వచ్చినా భాజపా అండగా నిలుస్తుందని లక్ష్మణ్ స్పష్టంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరంతరం ప్రజల మధ్యే ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె వల్ల తెరాస ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజల మధ్య తిరగలేకపోతున్నారని లక్ష్మణ్ విమర్శించారు. 47 రోజులుగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు ఈ సందర్భంగా లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వాన్ని కూల్చాలనే ఆసక్తి భాజపాకు లేదని, ప్రజలే ఈ ప్రభుత్వాన్ని కూల్చేందుకు సిద్ధమవుతున్నారని లక్ష్మణ్ అన్నారు. ఇచ్చిన హామీలను పరిష్కరించకుండా, ప్రజల సమస్యలను పక్కనపెట్టి కేసీఆర్ రాజకీయాలు చేస్తున్నాడని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయా అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందని అన్నారు. రెవెన్యూశాఖలోని పలువురు అధికారుల ఇబ్బందుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంఘాలకు నాయకత్వం వహించిన తెరాస నాయకులు న్యాయపరమైన ఆర్టీసీ డిమాండ్లపై ఎందుకు నోరు మెదపడంలేదు? గొంతులు ఎందుకు మూగబోతున్నాయి? పదవుల కోసమా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఓవైపు ప్రజలు అల్లాడిపోతున్నారని, ప్రజలు మీకు కర్రుకాల్చి వాత పెట్టే రోజులు రాబోతున్నాయని, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భాజపా అండగా ఉంటుందని లక్ష్మణ్ అన్నారు. వారికే కాదు.. ఎక్కడ ఎవరికి సమస్య వచ్చినా భాజపా కార్యకర్తలు అక్కడవాలిపోతారని, రాష్ట్రంలోని అనినీతి, కుటుంబ పాలనకు స్వస్తిపలికే దాకా పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

గ్రూప్-2 ప్రొవిజనల్ లిస్ట్‌పై స్టే విధించిన హైకోర్టు

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): గ్రూప్–2కు సంబంధించిన ఫైనల్ ప్రొవిజనల్ లిస్ట్‌పై స్టే విధించినట్లు బుధవారం హైకోర్టు తెలిపింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎలాంటి నియామకాలు చేపట్టారాదని టీఎస్‌పీఎస్సీనీ హైకోర్టు ఆదేశించింది. గతంలో గ్రూప్ 2 కేసులో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తూ టీఎస్‌పీఎస్సీ వ్యవహరించిందని గ్రూప్ – 2 అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వైట్నర్, ట్యాంపరింగ్, స్కాలింగ్ చేసిన అభ్యర్థులను సెలక్ట్ చేయొద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో గ్రూప్ 2 పరీక్షల్లో అందుకు సంబంధించిన జవాబులు తీసివేసి మిగిలిన వారికి ఇంటర్వ్యూలలో 1:2 ప్రకారం నియామకాలు జరపాలని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. అయితే తాజాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు లెక్కచేయకుండా మళ్లీ అదే అభ్యర్థులను సెలక్ట్ చేసి ప్రొవిజనల్ లిస్టు

ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ ఫైనల్ లిస్టుకు సెలక్ట్ కానీ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు టీఎస్‌పీఎస్సీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎలాంటి నియామకాలు చేపట్టరాదని హైకోర్టు తెలిపింది. కాగా, తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

విషాదం నింపిన హనీమూన్ యాత్ర

ట్రెక్కింగ్ చేస్తూ పడిపోయిన నవ వరుడు

చెన్నై,నవంబర్21(ఆర్ఎన్ఎ): విహారయాత్రకు హిమాచ్‌ప్రదేశ్‌లోని మనాలికి వెళ్లిన చెన్నై నవవరుడు మృతి చెందిన ఘటన ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. సోమవారం భార్య కళ్లెదుటే జరిగిన ఈ విషాద సంఘటన శోకాన్ని నింపింది. చెన్నై అమింజికరై తిరువీధి అమ్మన్ ఆలయం వీధికి చెందిన అరవింద్ (27). ప్రీతిలకు గత వారం వివాహం జరిగింది. అనంతరం కొత్త జంట హనీమూన్ కోసం హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలికి వెళ్లారు. డోబీ అనే ప్రాంతంలో ప్యారా÷–లగైడింగ్‌లో పర్యాటకులు విహరించడం విశేషం. దీనిని గమనించిన అరవింద్‌కు కుతూహలం ఏర్పడింది. ఇందుకోసం టికెట్ కొనుగోలు చేసి సోమవారం ప్యారా÷–లగైడర్ పైలట్ హరూరామ్‌తో అరవింద్ విహరించాడు. దీనిని ఆసక్తితో ప్రీతి గమనిస్తూ వచ్చింది. ఆకాశంలో విహరిస్తుండగానే కొద్ది సేపట్లో ప్యారా÷–లగైడర్‌లో అరవింద్ నడుముకు కట్టుకున్న బెల్ట్ వీడిపోయినట్లు తెలిసింది. దీంతో అరవింద్ ప్యారా÷–లగైడర్ నుంచి కింద నున్న పల్లంలో పడిపోయాడు. తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆ సమయంలో అత్యవసరంగా కిందకు దిగుతూ పైలట్ హరూరామ్ గాయపడ్డాడు. అతన్ని అదే ప్రాంతంతోని ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి విచారణ జరిపారు. అరవింద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కులు హాస్పిటల్‌కు తరలించారు. భర్త మృతదేహాన్ని చూసి ప్రీతి రోదించడం అక్కడి వారిని కలచి వేసింది. పోలీసుల ప్రాథమిక విచారణలో భద్రతా బెల్ట్‌ను సరిగా కట్టుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

బేషరతుగా ఆహ్వానిస్తే సమ్మె విరమణ

లేబర్ కోర్టులో న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో నిర్ణయం

అత్యవసర బేటీలో తాజా పరిణామాలపై చర్చ

ఆర్టీసీ జెఎసి సంచలన నిర్ణయం వెల్లడి

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ఆహ్వానిస్తే సమ్మె విరమించి విధుల్లో చేరుతామని, ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ సంచలన నిర్ణయం తీసుకుంది. కార్మికులను బేషరతుగా విధుల్లోకి తీసుకుంటే సమ్మె విరమించేందుకు సిద్ధంగా ఉన్నామని జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, కో కన్వీనర్లు రాజిరెడ్డి, థామస్ రెడ్డి సహా 16 మంది జేఏసీ నేతలు హాజరయ్యారు. హైకోర్టు తీర్పు, సమ్మె కొనసాగింపుపై కీలక చర్చలు జరిపారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన జేఏసీ నేతలు కీలక ప్రకటన చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై హైకోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నామని అశ్వత్థామరెడ్డి తెలిపారు. లేబర్ కోర్టులో న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం కూడా ఈ తీర్పును గౌరవించాలని కోరారు. కార్మికులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. భేషరతుగా ఎలాంటి షరతులు లేకుండా కార్మికులను విధుల్లోకి తీసుకోవాని, కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని, ఆర్టీసీ యాజమాన్యాన్ని అశ్వత్థామరెడ్డి కోరారు. ఎలాంటి షరతులు లేకుండా కార్మికులను విధుల్లోకి తీసుకుంటే సమ్మెను విరమిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం, యాజమాన్యం ఆ దిశగా సత్వరమే చర్య తీసుకుంటాయని ఆశిస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ 4 ముందు ఉన్న పరిస్థితులు ఆర్టీసీలో ఉంటే వెంటనే తాము సమ్మెను విరమిస్తామని ప్రకటించారు. లేబర్ కోర్టుపై తమకు మ్మకం ఉందని, అందువల్ల హైకోర్టు సూచలన మేరకు విధుల్లో చేరడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. హైకోర్టు తీర్పు కావీ తమకు బుధవారమే అందిందని...దాని పై చర్చించామని తెలిపారు. సమ్మెపై విచారణ చేపట్టాలని హైకోర్ట్ లేబర్ కోర్టుకు ట్రాన్సఫర్ చేసింది. ఈ సందర్భంగా కోర్ట్ తీర్పును తాము గౌరవిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల డిమాండ్లను అన్నీ లేబర్ కోర్ట్ అందజేసినట్లు చెప్పారు. లేబర్ కోర్టులో తమకు న్యాయం జరుగుతుందన్న అశ్వత్థామరెడ్డి...కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఎలాంటి షరతులు లేకుండా కార్మికుల్ని విదుల్లోకి తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. డ్యూటీ చాట్, అటెండెంట్ రిజిస్టర్‌పై మాత్రమే సంతకం పెడతామని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం త్వరగా కార్మికుల్ని విధుల్లోకి ఆహ్వానిస్తే సమ్మె విరమించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి చెప్పారు. అప్పటి వరకు ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె కొనసాగుతున్నట్లు అశ్వత్థామరెడ్డి వివరించారు. ఆర్టీసీ కార్మికుల ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. కాగా, ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమిస్తే ఏం చేయాలన్న దానిపై సర్కారు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. కార్మికులను ఎట్లా డ్యూటీలో చేర్చుకోవాలె, ఏమేం కండిషన్లు పెట్టాలన్న దానిపై ఆలోచన చేస్తోందని.. లేబర్ కోర్టు విచారణ, తీర్పు ఎట్లా ఉంటుందన్నది అంచనా వేస్తోందని సమాచారం. లేబర్ కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడాలా అన్న దానిపై తర్జనభర్జన జరుగుతున్నట్లు తెలుస్తోంది. కార్మికులు సమ్మెకు వెళ్లడంపై ఇప్పటికీ సీఎం సీరియస్‌గా ఉన్నారని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. ఇదిలాఉండగా, సమస్య పరిష్కరించాలంటూ తలసానిని కలిసిన ఆర్టీసీ కార్మికులపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి పర్యటనలో ఉన్న తలసానిని ఆర్టీసీ కార్మికులు కలిశారు. తమ సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేయాలని మంత్రిని కోరారు. దీంతో కార్మికులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన తలసాని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రకృతిని కలుషితం చేయరాదు

ఉన్న అడవులను,వనరులను కాపాడుకోవాలి

ఫారెస్ట్ ప్లస్ 2.0ను ప్రారంభించిన మంత్రి ఇంద్ర

హైదరాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): ప్రకృతి, పర్యావరణాన్ని కలుషితం చేసి, రక్షిత చర్యలు చేపట్టడం కంటే ఉన్న అడవులు, నీటి వనరులను యధాతథంగా కాపాడుకోవటమే మంచిదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, యూఎస్ ఎయిడ్, కేంద్ర, రాష్ట్ర అటవీ అధికారులతో కలిసి తెలంగాణలో ఫారెస్ట్ ప్లస్ 2.0ను లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం అటవీ అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపు, అటవీ పునరుజ్జీవన చర్యలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. క్షీణించిన అడవుల పునరుద్ధరణ, తెలంగాణ అంతటా పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో తెలంగాణకు హరితహారం ద్వారా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ప్రకృతి, అడవులు, జీవావరణ వ్యవస్థను కాపాడుకుంటేనే మానవులకు మనుగడ ఉంటుందని, ఆ దిశగా ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. యూఎస్ ఎయిడ్ డిప్యూటీ మిషన్ డైరెక్టర్ రమనో ఎల్ హమ్మూవి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున అమలు చేస్తున్న అడవుల పునరుజ్జీవనం, వన్యప్రాణుల రక్షణ చర్యలు బాగున్నాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడి, ప్రకృతి సంపదను పెంపొందించడానికి చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం బాగుందని ఆమె ప్రశంసించారు. పర్యావరణ రక్షిత చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా అటవీ శాఖ పనిచేస్తోందని, ఫారెస్ట్ ప్లస్ 2.0 విజయవంతానికి శాఖ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తామని పీసీసీఎఫ్ ఆర్. శోభ వెల్లడించారు. అడవుల సమగ్ర అభివృద్ధి, నీటి వనరుల సంరక్షణకు తోడు, అడవులపై ఆధారపడి జీవించేవారి ఆర్థిక ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా యూఎస్ ఎయిడ్, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఫారెస్ట్ ప్లస్ 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఐక్యరాజ్యసమతి 2021 నుంచి 2030 సంవత్సరాలను అంతర్జాతీయ పర్యావరణ, జీవావరణ వ్యవస్థల పునరుద్ధరణ దశాబ్దంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ సహకారంతో మూడు రాష్ట్రాల్లోని మూడు అటవీ సర్కిళ్లలో ఈ కార్యక్రమాన్ని కేంద్ర అటవీ శాఖ అమలుచేస్తోంది. బీహార్, కేరళకు తోడు తెలంగాణలో మెదక్ అటవీ డివిజన్ ను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఉమ్మడి కార్యక్రమం కింద మెదక్ ఫారెస్ట్ డివిజన్ నిర్వహణను మెరుగువ రచడానికి యూఎస్ ఎయిడ్, తెలంగాణ అటవీ శాఖకు సాంకేతిక సహాయం చేస్తుంది. ఈ కార్యక్రమంలో యూఎస్ ఎయిడ్–ఇండియా ప్రతినిధి వర్గిస్ పాల్, కేంద్ర అటవీ శాఖ ఐజి నోయల్ థామస్, మెదక్ జిల్లా కలెక్టర్ కె.ధర్మారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ అండ్ ఎండీ రఘువీర్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ కన్వర్జీత్ సింగ్, ఫారెస్ట్ ప్లస్ 2.0 తెలంగాణ నోడల్ అధికారి లోకేష్ జైస్వాల్, పీసీసీఎఫ్(అడ్మిన్) మునీంద్ర, అదనపు పీసీసీఎఫ్ లు ఆర్.ఎం. డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చెన్నమనేని రమేశ్‌కి కేంద్రహోంశాఖ షాక్

ఆయన పౌరసత్వం రద్దు చేస్తూ నిర్ణయం

మోసపూరితంగా పౌరసత్వం పొందారని వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్21(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు కేంద్ర హోంశాఖ గట్టి షాకిచ్చింది. ఆయన భారత పౌరసత్వానికి అనర్హుడని ప్రకటించింది. దీంతో పౌరసత్వం విషయంలో టీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. చెన్నమనేని రమేష్ భారత పౌరసత్వం రద్దయింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చెన్నమనేని రమేష్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారంటూ కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ కేంద్ర హోంశాఖ కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోంశాఖ మరోసారి విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ నిర్ణయంపై హైకోర్టు తుది తీర్పు వెలువరించనుంది. తప్పుడు ధ్రువపత్రాలతో దేశ పౌరసత్వం పొందినందున రమేశ్ ఎన్నిక చెల్లదంటూ ఆయన రాజకీయ ప్రత్యర్థి ఆది శ్రీనివాస్ 2009 నుంచి న్యాయపోరాటం చేస్తున్నారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వాన్ని మూడు నెలల్లోపు తేల్చాలని తెలంగాణ హైకోర్టు కేంద్ర హోంశాఖను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తమ అభ్యంతరాలను కేంద్ర హోంశాఖకు మూడు వారాల్లోగా చెప్పాలని చెన్నమనేనికి, పిటిషనర్‌కు సూచనలు చేసింది. దీనిపై పునఃసమీక్ష జరిపిన కేంద్ర హోంశాఖ చెన్నమనేని మోసపూరితంగా భారత పౌరసత్వాన్ని పొందారని తేల్చింది. అనేక వాస్తవాలు దాచి తప్పుడు మార్గాలలో పౌరసత్వం కలిగి ఉన్నారని నిర్ధారించింది. చెన్నమనేని రమేష్ భారత పౌరుడిగా కొనసాగడానికి అర్హత లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ కీలక ఆదేశాలు ఇచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ ఎమ్మెల్యేగా చెన్నమనేని రమేశ్ గెలుపొందిన సంగతి తెలిసిందే. ఆయన జర్మనీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో ద్వంద్వ పౌరసత్వం అంశం తెరపైకి వచ్చింది. రమేష్ పౌరసత్వం మీద వివాదం ఉన్న విషయం విదితమే. ఆయన 1993 లో జర్మనీకి వలసవెళ్లారు. జర్మనీ పౌరసత్వాన్ని స్వీకరించారు. ఆ తర్వాత 2009లో భారత్‌కు తిరిగి వచ్చారు. మళ్లీ భారత పౌరసత్వాన్ని స్వీకరించారు. మూడుసార్లు టీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచిన చెన్నమనేని రమేష్ పౌరసత్వం మీద అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆది శ్రీనివాస్ అనే నాయకుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆ వివాదం కేంద్ర హోంశాఖ వద్దకు వచ్చింది. దీనిపై 2017 లోనే ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే, చెన్నమనేని రమేష్ దీనిపై రివ్యూ పిటిషన్ వేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేసి త్వరగా నిర్ణయం ప్రకటించాలని ఇటీవల కేందకర హోంశాఖను ఆదేశించింది.

భూస్వాముల కోసమే రెవెన్యూ ప్రక్షాళన

విత్తన భండాగారం తెలంగాణలో నకిలీ విత్తనాలు

సర్కార్ విధానాలను తూర్పార బట్టిన కాంగ్రెస్ నేతలు

వరంగల్,నవంబర్21(ఆర్ఎన్ఎ): భూస్వాముల కోసమే రెవెన్యూ ప్రక్షాళన చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. రెవెన్యూ ప్రక్షాళన పేరుతో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వ వైఖరితో అధికారులపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని వెల్లడించారు. నకిలీ విత్తనాలతో రైతులు ఇప్పటికే నష్టపోయారన్నారు. నకిలీ విత్తనాలను బయటపెట్టిన అధికారులను సస్పెండ్ చేశారన్నారు. పార్టీలను పోషిస్తే చాలు అక్రమ విత్తన కంపెనీలకు అనుమతులు ఇస్తున్నారని వివరించారు. నకిలీ విత్తన కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వరంగల్‌లో జరిగిన విత్తన సమీక్షలో భట్టి మాట్లాడారు. ఒకప్పుడు విత్తన భాండాగారంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు నకిలీ విత్తనాలతో కునారిల్లుతోందని అన్నారు. దేశంలో హరిత విప్లవం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. నేడు భారతదేశం 128 దేశాలకు ఆహారం అందిస్తోందంటే అది కాంగ్రెస్ ఘనతే అని అన్నారు. కేసీఆర్ రైతుబంధు ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. ఫామ్ హౌస్, ప్రగతి భవన్‌కే కేసీఆర్ పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. 60ఏళ్ల ఉద్యమం తరువాత వచ్చిన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి నిర్ణయాలన్నీ

స్వార్థపూరితంగా ఉన్నాయన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే రైతు సేవా సమితి నాయకులు ఏం చేస్తున్నారని పొన్నాల ప్రశ్నించారు. మద్దతు ధరకు బ్జడెట్‌లో కేటాయింపులు లేవని విమర్శించారు. కనీసం కేంద్రం నుంచి వచ్చే నిధులు తెచ్చుకోవడానికి ఫామ్ హౌస్‌లో పడుకుంటున్నారని నిప్పులు చెరిగారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. తెలంగాణలో ఎన్ని ఆత్మహత్యలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడవద్దని హితవుచెప్పారు. ఇదే సమయంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై స్పందించిన పొన్నాల లక్ష్మయ్య కేసీఆర్ తీరును తూర్పారబట్టారు. రాళ్ల కరుగుతున్నాయ్ కానీ.. కేసీఆర్ మనసు కరగడం లేదన్నారు. కొండగట్టులో ప్రమాదం మృతులను, ఆర్టీసీ కార్మికులు చనిపోతే కేసీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రైతు విభాగం నేత కోదండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కీలక మలుపు

శివసేనకు 17 మంది ఎమ్మెల్యేల షాక్

ఎన్సీపి,కాంగ్రెస్‌తో శివసేన జతకట్టడంపై అభ్యంతరం

ముంబయి,నవంబర్21(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరుగుతున్నాయి. అంచనాలకు అందకుండా రాజకీయాలు రసవత్తరంగా తయారయ్యాయి. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ధీమాగా ఉన్న శివసేనకు బుధవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు గట్టి షాక్ ఇచ్చారు. ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కలిసి ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ 17 మంది ఎమ్మెల్యేలు గళమెత్తారు. అనమ్మతి ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో భేటీ కానున్నారు. మరోవైపు శివసేన సారథ్యంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. ఇక ప

గంగపుత్రుల గతి మారుస్తా

- వేట నిషేధ కాలంలో ప్రతి కుటుంబానికి రూ.10వేలు
- కోస్తా తీర జిల్లాల్లో ఫిష్‌లాండింగ్ సదుపాయం
- ఐదు నెలల్లోపే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చాం
- సంక్షేమ పథకాలనుచూసి ప్రతిపక్షం ఓర్వలేకపోతుంది
- ఎంతమంది శత్రువులు నాపై కుట్రపన్నినా.. వారందరినీ ఎదుర్కొనే శక్తి నాకుంది
- ఏపీ సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి
- వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకం ప్రారంభించిన జగన్
- వైఎస్ఆర్ వారధిని ప్రారంభించిన జగన్మోహన్‌రెడ్డి

కాకినాడ, నవంబర్21(ఆర్ఎన్ఎ) : గంగపుత్రుల జీవితాలు మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా మామిడివరం నియోజకవర్గంలో మత్స్యకార భరోసా పథకాన్ని జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మత్స్యకార కుటుంబాలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నామని తెలిపారు. మత్స్యకారు లంతా సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో ఆదాయాన్ని కోల్పోతున్నారని, అందువల్ల వేట నిషేధ కాలంలో ప్రతి కుటుంబానికి రూ.10 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మత్స్యకారులకు డీజిల్‌పై అందించే రాయితీని రూ.9కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. వేటకు వెళ్లి మృతి చెందిన కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందిస్తామని జగన్ చెప్పారు. పాదయాత్ర సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన మాటలు తనకు ఇంకా గుర్తున్నాయని.. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే వారికి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. వైఎస్ఆర్ మత్స్యభరోసా ద్వారా రాష్ట్రంలోని 1.35 లక్షల మత్స్యకార కుటుంబాలకు లబ్ది చేకూరనుందని అన్నారు. మౌలిక సదుపాయాలను ప్రాధాన్యతా క్రమంలో కల్పించడానికి బ్జడెట్‌లో మత్స్య శాఖకు రూ.551 కోట్లు కేటాయించినట్ల సీఎం వివరించారు. తొమ్మిది కోస్తా తీర జిల్లాల్లో దశల వారీగా ఫిష్ లాండింగ్ సదుపాయాలను కల్పిస్తామని జగన్ అన్నారు. మూడు కొత్త ఫిషింగ్ హార్బర్లు (నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె, తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ, ప్రకాశం జిల్లా ఓడరేవులో) ఏర్పాటు. మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్‌ల పటిష్టానికి చర్యలు కూడా తీసుకుంటామని అన్నారు. మర పడవల నిర్వాహకులకు గత ప్రభుత్వం లీటర్ డీజిల్‌కు ఇచ్చే రూ.6.03 రాయితీ ఇప్పుడు రూ.9కి పెంచుతున్నామని, మరపడవలకే కాకుండా ఇంజను కలిగిన తెప్పలకూ డీజిల్ రాయితీ వర్తింపు.. ఒక్కో మర పడవకు నెలకు రూ.27వేలు, ఇంజను కలిగిన తెప్పలకు రూ.2,700 రాయితీ ఇస్తున్నామన్నారు. ఏడాదిలో పది నెలలకు స్మార్ట్ కార్డుల ద్వారా రాయితీ అందుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలు తిరగకముందే ఆనాడు నేను ఇచ్చిన హామీని ఇదే వేదికపై నుంచి నెరవేరుస్తున్నాను. ప్రభుత్వ ఏర్పడిన ఐదు నెలల్లోపే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇవ్వగలిగామని అన్నారు. ఆ ఉద్యోగులంతా గ్రామీణ ప్రాంతంలో పేదలకు, రైతులకు, మత్స్యకారులకు అండగా ఉంటున్నారని జగన్ తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకూ సహాయం చేశామని, వారందరినీ ఆదుకున్నామని అన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీలకు నామినేటేడ్ పదవులు, పనుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించామని అన్నారు. అలాగే మహిళలకూ రిజర్వేషన్లు కల్పించామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తామన్నారు. నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే పేదలకు మరింత మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఆస్పత్రులను కూడా మెరుగుపరుస్తున్నామని జగన్ తెలిపారు. పేదల పక్షపాతిగా వ్యవహరిస్తున్న మన ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు అనత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎంతమంది శత్రువులు నాపై కుట్ర పన్నినా.. వారందరినీ ఎదుర్కొనే శక్తి నాకుందని జగన్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షం ఓర్వేట్లేదు. మీ అందరి ఆశీర్వాదాలతో మరింత ముందుకు సాగుతానని అన్నారు. అంతకు ముందు జగన్మోహన్‌రెడ్డి గౌతమి గోదావరిపై ఐ.పోలవరం మండలం పశు వుల్లంక సలాదివారిపాలెం మధ్య రూ.35 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ వారధిని సీఎం జగన్ ప్రారంభించారు. వారధి వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ప్రేమికుడి కోసం అక్క ఇంటికి కన్నమేసిన చెల్లి

పోలీసులు కూపీ లాగడంతో బయపటపడ్డ దొంగతనం

హైదరాబాద్,నవంబరు21(ఆర్ఎన్ఎ): ప్రేమికుడి ఆర్థిక అవసరాలను తీర్చేందుకు ఓ చెల్లెలు సొంత అక్క ఇంటికే కన్నమేసి పట్టుబడింది. హైదరాబాద్ రామాంతపూర్ కు చెందిన 20 ఏళ్ల ఝాన్సీ.. బంజారా హిల్స్ లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న రాహుల్ (21) కొంత కాలంగా ప్రేమించుకు ంటున్నారు. రాహుల్ కు కొంత డబ్బు కావాల్సి ఉండగా?అదే విషయాన్ని ఝాన్సీకి విషయం చెప్పాడు. ఎలాగైనక తన ప్రేమికుడికి సహాపడాలనే తపనతో ఫీర్జాదిగూడ బుద్దానగర్ లో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లింది ఝాన్సీ. అక్క ఇంట్లో లేని సమయంలో బంగారు నగలు దొంగిలించి ?వాటిని రాహుల్ కు ఇచ్చింది. నిఖిల్ అనే తన స్నేహితుడితో కలిసి వాటిని అమ్మేశాడు రాహుల్. ఇంట్లోని బంగారం పోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఝన్సీపై అనుమానం వచ్చింది. విచారించడంతో ఆమె నేరాన్ని అంగీకరిం చింది. రాహుల్, నిఖిల్, ఝాన్సీలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. నాలుగు తులాల బంగారు నగలను రికవరీ చేశినట్లు తెలిపారు పోలీసులు.

ఒడిషా శాసనసభలో వింత ఘటన

స్పీకర్‌కు కాంగ్రెస్ సభ్యుడి ఫ్లయింగ్ కిస్

భువనేశ్వర్,నవంబరు21(ఆర్ఎన్ఎ): ఒడిషా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్‌కు ఫ్లయింగ్ కిస్ ఇచ్చి కాంగ్రెస్ ఎమ్మెల్యే వార్తల్లో నిలిచారు. సమావేశాల సందర్భం గా స్పీకర్ ఎస్.ఎన్ పాట్రోకు కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ఫ్లయింగ్ కిస్ ఇచ్చి సభలో ఆశ్చర్యానికి గురి చేశారు. దీంతో శాసన సభ్యులంతా ఒక్కసారిగా నవ్వారు. అయితే స్పీకర్‌కు కిస్ ఇవ్వడంపట్ల ఎమ్మెల్యే వివరణ ఇచ్చారు. 'నా నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతగా స్పీకర్‌కు ఫ్లయింగ్ ఇచ్చాను. ఇందులో వేరే ఉద్దేశం ఏమీ లేదు' అంటూ వివరించారు. గతంలో పార్లమెంటులో రాహుల్ కూడా ఓ మారు ప్రధాని మోడీని హత్తుకున్న విషయం తెలిసిందే.

సోనియాకు భద్రత కుదింపులో ఎలాంటి రాజకీయం లేదు

హోంమంత్రిత్వ శాఖ సూచననలతోనే నిర్ణయం: నడ్డా

న్యూఢిల్లీ ,నవంబరు21(ఆర్ఎన్ఎ): సోనియాగాంధీ కుటుంబానికి స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ భద్రత తొలగింపులో ఎలాంటి రాజకీయం లేదని కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. పార్లమెంటులో సోనియా కుటుంబానికి ఎస్పీజీ భద్రత ఉపసంహరణపై కాంగ్రెస్ పార్టీ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నకు జేపీ నడ్డా సమాధానం ఇచ్చారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో దీనిపై సమాధానం ఇవ్వాల్సిరావడంతో ఆయన తరపున లోక్ సభలో జేపీ నడ్డా సమాధానం ఇచ్చారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నాయకులకు హెచ్చరికల స్థాయిని బట్టి భద్రతను ఏర్పాటు చేస్తుందని, ఇది కేవలం ప్రోటోకాల్ ప్రకారమే హోంమంత్రిత్వశాఖ ఎస్పీజీ భద్రతను తొలగించిందని నడ్డా వివరించారు. నాయకులకు భద్రత కొనసాగించాలన్నా, ఉపసంహరించుకోవాలన్న హోంశాఖ అధికారులే సమీక్షించి నిర్ణయం తీసుకుంటారని, ఇందులో రాజకీయనేతల ప్రమేయం ఉండదని నడ్డా స్పష్టం చేశారు. సోనియా కుటుంబానికి ఎస్పీజీ భద్రత తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ పార్లమెంటులో ప్రస్థావించారు. సోనియాగాంధీ కుటుంబ భద్రతపై స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఈ వారం సంచలన లేఖ రాసింది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్, అతని భార్య గురుశరణ్ కౌర్‌ల భద్రత కోసం బు÷-లలెట్ ప్రూఫ్ వాహనాలు అందించాలని సీఆర్‌పీఎఫ్ స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు లేఖ రాసింది. ఈ నెల 8వతేదీన సోనియాగాంధీ కుటుంబానికి ఎస్పీజీ భద్రతను తొలగించి, జడ్ ప్లస్ కేటగిరి రక్షణ బాధ్యతలను స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కు కేంద్ర హోంమంత్రిత్వశాఖ అప్పగించిన నేపథ్యంలో ఈ లేఖ రాసింది. సోనియాగాంధీ కుటుంబానికి ఎస్పీజీ భద్రత ఉన్నపుడు కేటాయించిన టాటాసఫారీ, స్కార్పియో బు÷-లలెట్ ప్రూఫ్ కార్లను వినియోగించేవారు. ఎస్పీజీ భద్రతను తొలగించటంతో బు÷-లలెట్ ప్రూఫ్ వాహనాలను కూడా ఎస్పీజీ ఉపసంహరిం చుకుంది.సోనియాగాంధీ కుటుంబానికి ఒక్కొక్కరికి వందమంది సాయుధ కమెండోలతో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించిన నేపథ్యంలో బు÷-లలెట్ ప్రూఫ్ వాహనాలను కూడా సత్వరం అందించాలని సీఆర్‌పీఎఫ్ స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ను కోరింది.

దిగివస్తున్న కూరగాయల ధరలు

నిజామాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం రైతులు తెచ్చిన కూరగాయల విక్రయాలు యాభైశాతం వరకు తగ్గిపోగా.. వినియోగదారుల కొనుగోళ్లూ చాలా వరకు తగ్గాయి. వర్షాలు ఈ ఏడాది విస్తారంగా కురవడంతో కూరగాయల దిగుబడి పెరిగింది. ధరలు కూడా తగ్గడంతో తాజా కూరగాయలతో జనం ఊరట చెందుతు న్నారు. టమాటాలు,ఇతర కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడిప్పుడే రైతుబజార్లు కాస్త కుదుటపడుతున్నాయి. రైతులు తక్కువ ధరలకు కొనుగోలుదారులకు కూరగాయలు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. నిజామాబాద్ చుట్టపక్కల పండించిన పంటలతో ప్రధాన మార్కెట్‌తో పాటు చుటు పక్కల కాలనీల్లో వందలాదిమంది వెండర్లు కూరగాయలు విక్రయిస్తారు. ఇంతకాలం ధరల కారణంగా రైతుబజార్‌లోవిక్రయాలు సగానికి పడిపోయాయని రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉద్యోగులే ఉ ండడంతో గతంలో వారానికి సరిపడా కూరగాయలను కొనుక్కెళ్లేవారు. ఇప్పుడు రెండు రోజులకు సరిపడేవే కొంటున్నారు. కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో అమ్మకాలను అధిగమిస్తున్నామని అభిప్రాయ పడుతున్నారు. దీంతో వ్యాపారాలు మళ్లీ పుంజుకుంటున్నాయని అన్నారు.

చెన్నమనేని వస్తే సమాచారమివ్వండి

- హైకోర్టులో కేవియట్ దాఖలు చేసిన ఆది శ్రీనివాస్
- పౌరసత్వం రద్దు నిర్ణయం అభినందనీయం
- విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్

హైదారాబాద్, నవంబర్21(ఆర్ఎన్ఎ) : పౌరసత్వం రద్దు విషయంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తే తనకు సమాచారం ఇవ్వాలని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ కెవియేట్ పిటిషన్ దాఖలు చేశారు. చెన్నమనేని రమేష్ పౌరసత్వం రద్దు చేస్తూ హోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులతో హైకోర్టులో కెవియట్ దాఖలు చేశారు. తమకు తెలియకుండా ఎలాంటి పక్రియను చేపట్టారదని పిటిషన్ లో తెలిపారు. ఇదిలాఉంటే రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన చెన్నమనేని రమేశ్ పౌరసత్వం రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం అభినందనీయమని పిటిషనర్ కాంగ్రెస్‌నేత ఆది శ్రీనివాస్ అన్నారు.

గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసి.. ఎమ్మెల్యే రమేష్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చట్టాలను తప్పుదోవ పటించే వ్యక్తులు.. చట్టాలను తయారు చేసే వ్యక్తులుగా ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. గతంలోనే హైకోర్టు, సుప్రీంకోర్టు, కేంద్ర హోంశాఖ అతన్ని భారత పౌరుడు కాదని తేల్చిచెప్పాయని గుర్తు చేశారు. మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తా అనటంతో హైకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేశానని శ్రీనివాస్ వివరించారు. ఎమ్మెల్యే రమేష్ హైకోర్టును ఆశ్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. తమ వాదనలను కూడా మరోసారి కోర్టుకు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానాలపై విశ్వాసం ఉందని.. హైకోర్టులో తాను గెలుస్తాననే నమ్మకం ఉందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన చెన్నమనేని రమేశ్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారంటూ ఆయన రాజకీయ ప్రత్యర్థి ఆది శ్రీనివాస్ 2009 నుంచి న్యాయ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. తప్పుడు ధ్రువపత్రాలతో మన దేశ పౌరసత్వం పొందినందున రమేశ్ ఎన్నిక చెల్లదంటూ ఆది వాదిస్తూ వస్తున్నారు. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోంశాఖ మరోసారి విచారణ జరిపి, తాజాగా తన నిర్ణయాన్ని వెలువరించింది.

వాతావరణాన్ని అనుకూలం చేసుకుంటున్న ఎమ్మెల్యే

తనకు తిరుగులేని విధంగా ముందుకు సాగుతున్న రవిశంకర్

కరీంనగర్,నవంబర్21(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం తనకు అనుకూలంగా మార్చుకున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇప్పుడు ప్రత్యర్థులకు అందనంతగా అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకుని పోతున్నారు. రోజుకో గ్రామంలో పర్యటిస్తూ సమస్యలపై అవగాహనతో ముందుకు సాగుతున్నారు. వివిద పథకాలను ఇక్కడ అమలు చేసేలా చొరవ తీసుకుంటున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న బొడిగె శోభకు టిక్కెట్ రాకుండా చేసి, టిక్కెట్ దక్కించుకుని గెలిచారు. ఆమె బిజెపి నుంచి నిలిచినా గెలుపు తనకు దక్కేలా పావులు కదిపారు. ఇప్పుడు శోభ బిజెపి నేతగా ఆర్టీసీ తదితర సమస్యలపై పోరాడుతున్నా, రవి మాత్రం చాపకింది నీరులా ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో మిగతా చోట్ల టీఆర్ఎస్ పార్టీకి నెగిటివ్ టాక్ వస్తే.. చొప్పదండిలో మాత్రం పాజిటివ్ పబ్లిసిటీ వస్తుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి అంటే వివాదాస్పదమైన నియోజకవర్గంగా పేరున్నా దానిని తన వరకు రాకుండా చూసుకుంటున్నారు. దీనికితోడు రవిశంకర్ ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మార్కెట్ కమిటీల్లో.. ఉద్యమం నుంచి పార్టీ జెండా మోసిన వారికి పదవులు ఇస్తున్నారని సభావేదికల మీద ఎమ్మెల్యే రవిశంకర్ ను కార్యకర్తలు ఆకాశానికెత్తుతున్నారు. వాస్తవంగా రాష్ట్రం మొత్తం మీద టిఆర్ఎస్ అధిష్టానం ఉద్యమకారులను పక్కన పెట్టిందన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ముందు నుండి పార్టీ జెండా మోసిన వారిని కాకుండా ఉద్యమానికి ద్రోహం చేసిన నేతలను చేర్చుకొని వారికి మంత్రి పదవులు ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. కేసీఆర్ ను బాగా విమర్శించిన వారికి ఏకంగా మంత్రి పదవులే కట్టబెట్టారని స్వపక్షీయులే గగ్గోలు పెడుతూ వస్తున్నారు. చొప్పదండిలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. తన నియోజకవర్గంలో ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తున్నారు. గోపాలరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వెంకట్ రెడ్డిని నియమించారు. ఆయన ప్రమాణ స్వీకారానికి మంత్రి గంగుల కమలాకర్‌ను కూడా పిలిపించారు. వేదిక మీద ఆరు మండలాల ప్రజా ప్రతి నిధుల మధ్య పలువురు ఉ ద్యమకారులను సన్మానించారు. మరోవైపు గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మరో ఉద్యమకారుడు మహిపాల్ రావుకు అవకాశమిచ్చారు. గంగాధర మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రుల కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ ను ఆహ్వానించారు. ఉ ద్యమకారునికి పెద్ద పీట వేశారని వేదిక మీద ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను నేతలు పొగిడారు. ఇక మల్యాల మండలంలోని ఉద్యమకారుడు జనగాం శ్రీనివాస్‌కు మార్కెట్ కమిటీ పదవి ఇవ్వడం కూడా ఎమ్మెల్యే రవిశంకర్‌కు మంచి పేరు తెచ్చింది. మొత్తం మీద చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన నియోజకవర్గంలో ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తున్నారని చర్చ జోరుగా సాగుతోంది. అలాగే పదవులు రాని మండలాల్లో ఉన్న సీనియర్ కార్యకర్తలు కూడా ఏదో ఒక పదవి ఇచ్చి గౌరవించాలని వారు కాంక్షిస్తున్నారు.

IN THE COURT OF THE
M.A.C.T-CUM-XII
ADDL CHIEF JUDGE
CITY CIVIL COURT
AT SECUNDERABAD
M.V.O.P NO. 151 OF 2019

Between:
Mrs. B. Pushpa and others
...Petitioners
And
Mr. Mohammed Shakeel and others
..Respondents

To
Mr. Mohammed Arshad Ali
S/o. Mohd. Anwar Ali
Age: Major, Occ: Owner of Lorry Bearing No.AP35 W 7165,
H.No. 9-1-1/B/75/19,
Defence Colony,
Langer House, Golkonda
Hyderabad.
..Respondent No.2

Whereas the above named Petitioners filed compensation petition against you and Bajaj Allianz General Insurance Company Ltd. for a sum of Rs. 40,00,000/- for the accident caused by your **Vehicle Lorry Bearing No.AP 35W 7165,** on 25-08-2018 at Parigi ps limits. The above case is posted on **11-12-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 AM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE COURT)
C. VENU GOPAL REDDY
S. VENKAT REDDY
A. POORNACHANDRA RAO
Advocatess.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad.
Cell: 9440431541

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట వద్ద బోల్తాపడ్డ ఆటో

ప్రయాణికుల ఆటో బోల్తా: ఒకరు మృతి

రాజన్న సిరిసిల్ల,నవంబర్21(నేటినిజం ప్రతినిధి): రాజన్న జిల్లాలోని కోనరావుపేట శివారులో రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది.

ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందగా మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శవ పరీక్ష కోసం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జడ్పీ ఫైర్‌పర్సన్ అరుణ పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగై చికిత్స అందించాలని ఆమె వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సమ్మెపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు ఖాన్ వెల్లడి

న్యూఢిల్లీ,నవంబరు21(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఆర్టీసీ సమ్మెపై కేంద్రం జోక్యం చేసుకోవాలని తెలంగాణ ఆర్టీసీ సమ్మె అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ ఎంఏ ఖాన్ బుధవారం రాజ్యసభలో ప్రస్తావించారు. 50 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా.. టీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సమ్మె కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమ్మెపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఎంఏ ఖాన్ కోరారు. కార్మికులు సమ్మె చేసతున్నా, బస్సులు తిరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నా కెసిఆర్ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. అనేకమంది కార్మికులు ఆత్మహత్య చేసుకోగా, పలువురు గుండెపోటుతో మరణించారని ఆయన అన్నారు. బస్సులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ప్రజారోగ్యం కోసం ఉద్యమిస్తాం

- డెంగ్యూను ఆరోగ్యశ్రీలో చేర్చాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబర్21(నేటినిజం ప్రతినిధి) : రాష్ట్రంలో డెంగ్యూ, కేన్సర్ ప్రజల ను పట్టి పీడిస్తున్నాయని, ప్రస్తుతం డెంగ్యూ ప్రధాన సమస్యగా మారిందని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశ ంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డెంగ్యూను ఆరోగ్యశ్రీలో చేర్చాలని డిమాండ్ చేశారు.

దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజారోగ్యం కోసం ఉద్యమిస్తామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. కేన్సర్ బాధితులకు రూ. 20 లక్షలు ఖర్చు అవుతోందని జగ్గారెడ్డి అన్నారు. చినజీయర్ తన వద్దకు వచ్చే ధనిక భక్తుల చేత ట్రస్ట్ పెట్టించి.. కేన్సర్ బాధి తులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఈ మేరకు చినజీయర్, సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తానని ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిం దని, సీఎం కేసీఆర్, మంత్రులు రాజకీయ లాలకోసమే పాకులాడుతున్నారు తప్ప పేద ప్రజల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవటం లేదని అన్నారు. రాష్ట్రం లో పాలన పూర్తిగా స్తంభించినట్లు కనిపిస్తుం ది, పనులు జరగడం లేదని జగ్గారెడ్డి అన్నా రు. సీఎం కేసీఆర్ మొండివైఖరితో ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నా రని, షర తులు లేకుండా వారిని విధుల్లోకి తీసుకోవా లని జగ్గారెడ్డి మాండ్ చేశారు. రెండవ దఫా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని జగ్గారెడ్డి అన్నారు.

ప్రజాసమస్యలపై నిలదీస్తాం: సిపిఐ

ఆదిలాబాద్,నవంబర్21(ఆర్ఎన్ఎ): ప్రజాసమమస్యలపై సిపిఐ నిరంతరంగా పోరాడుతుందని సిపిఐ నాయకుడు,మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశం అన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంకోట్లు దోచుకుంటోందన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణాను కుటుంబ తెలంగాణాగా మారుస్తున్నాడన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలతోనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మతోన్మాద శక్తులు వేగం పుంజుకుంటున్నాయని, కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాలను తమ గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు.స్వచ్ఛభారత్,నల్లధనం అంటూ అధికారాన్ని చేజిక్కించుకున్న ప్రధాని మోదీ.. వాటి విషయంలో పురోగతి సాధించలేక పోయారన్నారు. నల్లధనాన్ని వెనక్కు రప్పించి పేదల ఖాతాల్లో వేస్తానని చెప్పి.. నేడు రూ.500, రూ.1000 నోట్ల రద్దుతో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. ఆర్థిక మాంద్యం వెన్నాడుతున్నా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని, రానున్న రోజులలో మోదీ దోషిగా ప్రజల ముందు నిలబడక తప్పదని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతున్నారన్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ నిర్బంధం పెరుగుతోందని ఆయన దుయ్యబట్టారు.

తెలంగాణలో అభివృద్ధి పరుగులు

ఫార్మా,ఐటి పెట్టుబడులకు అవకాశాలు

అధర్ సిన్హాతో సింగపూర్ కాన్సులేట్ భేటీ

హైదరాబాద్,నవంబరు21(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నేతృత్వంలో రాష్ట్రం పలు రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని సాధారణ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అధర్ సిన్హా పేర్కొన్నారు. ఫార్మా, ఐటి, పట్టణాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. సింగపూర్ కాన్సులేట్ జనరల్ పాంగ్‌కాక్ టియాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయస్థాయి విమానాశ్రయంతో పాటు ఔటర్ రింగ్ రోడ్ ద్వారా మెరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉందని చెప్పారు. రాష్